అవగాహనే ఆయుధం

- ఎరువులు, విత్తనాల కొనుగోళ్లలో అప్రమత్తం
- రసీదు భద్రపరచడం తప్పనిసరి
- మండల వ్యవసాయ అధికారి వసంతరావు



రైతులు ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు కొనుగోళ్లలో అప్రమత్తంగా ఉండాలి. ఏ మాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా ఆరుగాలం పడిన కష్టం బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది. విత్తనాలు, ఎరువులు, మందులు కొనుగోళ్లలో మండల వ్యవసాయ అధికారి వసంతరావు సలహాలు, సూచనలు.

– జగదేవ్‌పూర్(గజ్వేల్)

వ్యవసాయశాఖ నుంచి లైసెన్స్ పొందిన డీలర్ల నుంచే విత్తనాలను కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన బిల్లుపై నంబరు, విత్తనం రకం, గడువు తేదీ, డీలర్ సంతకం, రైతు సంతకం ఉండేలా చూసుకోవాలి. లూజుగా సంచులు, పగిలిన ప్యాకెట్లు, తెరిచిన డబ్బాల నుంచి విత్తనాలను కొనొద్దు. గడువు దాటిన విత్తనాల జోలికి అసలే వెళ్లొద్దు. బిల్లుపై విక్రయదారుడి పేరు, కేంద్రం, రాష్ట్ర అమ్మకపు పన్ను నంబరు, రైతు పేరు, గ్రామం పేరు, రైతు, విక్రయదారుడి సంతకాలు, తేదీలు, రకం పేరు, బ్యాచ్‌నంబరు, గడువు తేదీలు, నికర తూకం, నికర ధర, కంపెనీ పేరు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. కొనుగోలు చేసే విత్తన ప్యాకెట్, సీసా, సంచి డబ్బాలపై సీలు ఉందా లేదా నిర్ధారించుకోవాలి. విక్రయదారుడు ఇచ్చే కరపత్రాలు తీసుకుని వాటిలో పేర్కొన్న అంశాలను చదవాలి. విత్తనాలు కొనుగోలు చేసిన బిల్లును పంటకాలం పూర్తయ్యేంత వరకు దాచి ఉంచుకోవాలి. అరువు(అప్పు) పద్ధతిలో కొనుగోలు చేసినప్పటికీ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తనాలు తీసుకున్న వెంటనే మొలక శాతాన్ని చూసుకోవాలి. మొలక శాతం సంతృప్తికరంగా ఉన్న వాటినే విత్తనాలుగా వాడాలి.

పురుగుల మందు విక్రయం

చీడపీడలకు వినియోగించే క్రిమిసంహారక మందుల కొనుగోలు సమయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన పురుగు మందులనే వాడాలి. పురుగు మందు డబ్బాలపై వజ్రాకారంలో పురుగు మందు స్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలం రంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చని రంగు గుర్తులుంటాయి. అవసరానికి మించి కొనుగోలు చేసిన, నిల్వ ఉంచిన పురుగు మందులను వాడొద్దు. లైసెన్స్ ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి. పురుగు మందులు రెండు, మూడు రకాలు కలిపి వాడకూడదు. వాడిన డబ్బాలు, సీసాలను ధ్వంసం చేసి గుంతల్లో పూడ్చివేయాలి. పురుగు మందుల వాడకానికి వినియోగించిన పాత్రలు, ఇతర అవసరాలకు వాడొద్దు.

కల్తీ ఎరువులను ఇలా గుర్తించాలి



యూరియా కాల్షియం, అమ్మోనియం నైట్రేట్, వంటి కాంప్లెక్స్ ఎరువులు, గుళికల రూపంలో ఉంటాయి. 15:15:15, 20:20:0 ఎరువుల రేణువుల రూపంలోనూ, పొటాష్ సూపర్ ఫాస్ఫేట్ పొడిరూపంలో ఉంటాయి. 15:15:15, 28:28:0, 19:19:19, 17:17:17, 24:24:0 యూరియా వంటి ఎరువులను ఒక చెంచాను 5 మిల్లీ లీటర్ల పరిశుభ్రమైన నీటిలో వేసి కలిపితే అడుగున మడ్డి చేరితే అది కల్తీదే. కొన్ని కాంప్లెక్స్ ఎరువులను ఇలా పరీక్షిస్తే ఇసుక రేణువులు వస్తే అది కల్తీ ఎరువుగా గుర్తించాలి.

ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్తలు



లైసెన్స్ పొందిన దుకాణాల్లోనే ఎరువులను కొనుగోలు చేయాలి. కొనుగోలు చేసిన బిల్లులు, ఖాళీ సంచులను పంటకాలం పూర్తయ్యేవరకు జాగ్రత్తగా దాచి ఉంచాలి. మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులు మాత్రమే వాడాలి. ఒకవేళ చేతి కుట్టు ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి. ప్రామాణిక పోషకాల వివరాలు, ఉత్పత్తి సంస్థ, ఉత్పత్తిదారుడు పేరు కచ్చితంగా ఉండాలి. కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. ఎరువుల నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే వ్యవసాయ అధికారి సహకారంతో ఎరువులను పరీక్షకు పంపాలి. చిల్లులు పడి చిరిగిన ఎరువుల బస్తాలు కొనుగోలు చేయవద్దు. వేరే పదార్థాలు కలిస్తే ఆ ఎరువును కల్తీదిగా గుర్తించాలి.

వసంతరావు, మండల వ్యవసాయ అధికారి

గ్రామస్థాయిలో నాణ్యమైన విత్తనోత్పత్తి

వ్యవసాయ శాస్త్రవేత్తలు

గ్రామస్థాయిలో విత్తనోత్పత్తిని చేపట్టేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 'గ్రామగ్రామాన నాణ్యమైన విత్తనం' కార్యక్రమం చేపట్టింది. అందులో భాగంగా మంగళవారం జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. రైతు వేదికలలో జరిగిన ఈ కార్యక్రమాలలో విత్తనోత్పత్తి కోసం రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. సాగులో రైతులు అధికారుల సూచనలు పాటించాలని కోరారు.

వర్గల్(గజ్వేల్)/చిన్నకోడూరు(సిద్దిపేట)/మద్దూరు(హుస్నాబాద్)/బెజ్జంకి(సిద్దిపేట/జగదేవ్‌పూర్(గజ్వేల్)/కొండపాక(గజ్వేల్)/కోహెడ(హుస్నాబాద్)/ములుగు(గజ్వేల్)/అక్కన్నపేట(హుస్నాబాద్)/హుస్నాబాద్/దుబ్బాకటౌన్/సిద్దిపేటఅర్బన్/చేర్యాల(సిద్దిపేట): వర్గల్‌లో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ప్రమీల, మండల వ్యవసాయాధికారి శేషశయన మాట్లాడారు. ఏఈఓలు సునీత, భారతి, మానస, సుప్రజ తేజస్విని, సంతోష్, రైతులు పాల్గొన్నారు. చిన్నకోడూరు రైతు వేదికలో శాస్త్రవేత్త డా.పల్లవి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఓ జయంత్ కుమార్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు. మద్దూరులో తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం, జిల్లా వ్యవసాయశాఖ అధికారులు రైతులకు నాణ్యమైన విత్తన పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, ఏఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకి రైతు వేదికలో శాస్త్రవేత్త రమాదేవి మాట్లాడారు. ఏఎంసీ చైర్మన్ కృష్ణ, ఏఓ సంతోష్, సాయిచరణ్, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్‌లో ఏఓ వసంతరావు మూల విత్తనాల కిట్లను అందజేశారు. వ్యవసాయ విస్తరణ అధికారులు ఖలీల్, సమత, భాను ప్రకాశ్, కృష్ణమూర్తి, కిరణ్, రైతులు పాల్గొన్నారు. కొండపాకలో మండల వ్యవసాయాధికారి శివరామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సుభాన్సు, సుధాకర్, వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ పరశురాములు, ఏఈఓలు ప్రనూష, సుస్మిత, రమ్యశ్రీ, మౌనిక తదితరులు పాల్గొన్నారు. కోహెడలో వ్యవసాయ మార్కెట్ చైర్మన్ బొయిని నిర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తిరుపతిరెడ్డి, ఏఓ సతీశ్, శ్రీజయ, రాజు, శ్రీధర్‌రెడ్డి, జయరాజ్ పాల్గొన్నారు. ములుగు రైతు వేదికలో శాస్త్రవేత్త షేక్ అమీర్ బాషా, వ్యవసాయ అధికారులు పృథ్వి, అనుజ్ఞ, నివేదిత పాల్గొన్నారు. అక్కన్నపేట మండలం రామవరం రైతువేదికలో వ్యవసాయ విస్తరణాధికారి కరంటోతు శ్రీలత ఆధ్వర్యంలో వికసిత కృషి సంకల్ప అభియాన్‌పై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశంలో కృషి విజ్ఞాన కేంద్రం(తునికి)ఫార్మ్ మేనేజర్ భారతీ రాజా, వ్యవసాయ అధికారి తస్లీమా సుల్తానా, శాస్త్రవేత్తలు రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ రైతు వేదికలో నిర్వహించిన కార్యక్రమంలో తోర్నాల అగ్రి పాలిటెక్నిక్ అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజా, మండల వ్యవసాయ అధికారి శ్రేయ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చందు, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, రైతులు పాల్గొన్నారు. దుబ్బాక రైతు వేదికలో శాస్త్రవేత్త డాక్టర్ ఎల్లాగౌడ్ మాట్లాడుతూ.. ఫౌండేషన్ విత్తనాలను సాగుచేస్తే అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. మండల వ్యవసాయాధికారి ప్రవీణ్ కుమార్, ఏఈఓలు అలాగే రాయపోల్‌లో శాస్త్రవేత్త డాక్టర్ సరిత ఆధ్వర్యంలో రైతులకు ఫౌండేషన్ విత్తనాలను పంపిణీ చేశారు. సిద్దిపేటఅర్బన్‌లో తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రమాదేవి అవగాహన కల్పించారు. చేర్యాలలో ప్రొఫెసర్ అలీబాబా అవగాహన కల్పించారు. ఆకునూరు, చిట్యాల, దానంపల్లి రైతులకు నూజివీడు సీడ్ కంపెనీ అందించిన సీడ్ డ్రిల్స్‌ని డీఏఓ రాధికతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ భోగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



వర్గల్(గజ్వేల్): రైతులకు విత్తనప్యాకెట్లు అందజేస్తున్న శాస్త్రవేత్త ప్రమీల, ఏఓ శేషశయన



అక్కన్నపేట(హుస్నాబాద్): రామవరం రైతు వేదికలో అవగాహన కార్యక్రమం



చిన్నకోడూరులో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న పల్లవి తదితరులు

సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'

ఆర్డీఓ రామ్మూర్తి

హుస్నాబాద్‌రూరల్: రైతుల భూ సమస్యలను పరిష్కరించడానికే ప్రభుత్వం భూ భారతి చట్టం తెచ్చిందని ఆర్డీఓ రామ్మూర్తి అన్నారు. మడదలో మంగళవారం నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ధరణి చట్టంతో రైతులు భూ సమస్యలతో ఇబ్బంది పడ్డారని, ప్రభుత్వానికి రైతుల నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ధరణిని తొలగించి భూ భారతి చట్టం తెచ్చారని చెప్పారు. ఒకరి భూమి ఒకరు పట్టా చేయించుకొంటే దానిని రెవెన్యూ కోర్టులో అప్పీలు చేసుకోనే అవకాశం భూ భారతి చట్టంలో ఉందన్నారు. సాదా బైనామా, అసైన్డ్ భూముల పట్టాలు, వారసత్వ భూములు సర్వే నంబర్ల సవరణ చేయడానికి మోక విచారణ జరిపించి రికార్డులను క్రబద్ధీకరిస్తామని చెప్పారు. రైతులు భూ సమస్యలు ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తొలి రోజు మడదలో 9 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. తహసీల్దార్ లక్ష్మారెడ్డి, నాయబ్ తహసీల్దార్ రుక్మిణిరెడ్డి, ఆర్‌ఐలు రాజు, రాజయ్య, మార్కెట్ వైస్ చైర్మన్ బంక చందు పాల్గొన్నారు.



హుస్నాబాద్‌రూరల్: రైతుల ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఆర్డీఓ రామ్మూర్తి

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

ములుగు(గజ్వేల్): భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తుందని రైతులు సద్వినియోగం చేసుకోవాలని గజ్వేల్ ఆర్‌డీఓ చంద్రకళ సూచించారు. మండలంలోని క్షీరసాగర్, బండతిమ్మాపూర్ గ్రామాల్లో అధికారులు నిర్వహించిన రెవెన్యూ సదస్సులను మంగళవారం ఆమె పరిశీలించారు. సదస్సులలో వివిధ సమస్యలకు సంబంధించిన 68 దరఖాస్తులను రైతుల నుంచి స్వీకరించారు. తహసీల్దార్ ఆరీఫా, డిప్యూటీ తహసీల్దార్ భవాని, సీనియర్ అసిస్టెంట్ స్పందన, జూనియర్ అసిస్టెంట్ నరేశ్, ఆర్‌ఐలు హరీశ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూమిలో వెలసిన గ్రామ దేవత గుళ్లు

తొలగించిన ఆలయ అధికారులు, పోలీసులు

కొమురవెల్లి(సిద్దిపేట): మల్లికార్జున స్వామి ఆలయ భూములలో కొందరు నెలకొల్పిన గుళ్లను ఆలయ అధికారులు, పోలీసుల సాయంతో తొలగించారు. మంగళవారం తెల్లవారుజామున బుడిగ జంగాల కాలనీకి చెందిన కొందరు ఐదుగ్రామ దేవత గుళ్లను షాబాది బండలతో ఏర్పాటు చేసి పువ్వులతో అలంకరించారు. అది గమనించిన ఆలయ అధికారులు వెంటనే ఆగుళ్లను జేసీబీ సాయంతో తొలగింపజేశారు. ఆలయ అధికారులు తొలగించిన కొంత సమయానికి వారు తిరిగి గుళ్లను ఏర్పాటు చేయడానికి ప్రయత్నించారు. దీంతో ఆలయ అధికారులు పోలీసులను ఆశ్రయించడంతో ఎస్‌ఐ రాజు ఘటనా స్థలానికి చేరుకుని సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది. కార్యక్రమంలో ఆలయ ఏఈఓ శ్రీనివాస్, పరింటెండెంట్ శ్రీరాములు, ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



జేసీబీ సాయంతో గుళ్లను తొలగిస్తున్న ఆలయ అధికారులు

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గజ్వేల్‌రూరల్: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం 2వ రోజు పట్టణంలోని ఒకటో వార్డులో ప్రజలకు తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. తడి, పొడి చెత్తను వేరు చేసి ఇళ్ల వద్దకు వచ్చే పారిశుద్ధ్య కార్మికులకు అందించి, మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్ నర్సయ్య

రైతు వేదికలకు తాళం

ఆందోళనలో రైతులు

హుస్నాబాద్‌రూరల్: రైతులకు అందుబాటులో ఉండి సాగుకు సూచనలివ్వాల్సిన ఏఈఓలు రైతు వేదికలకు తాళం వేసి గ్రామాలకు రావడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. మహ్మదాపూర్ రైతు వేదికకు మంగళవారం తాళం వేసి ఉండటంతో రైతులు తిరిగి వెళ్లిపోయారు. ఫార్మ రిజిస్ట్రేషన్, విత్తనాలు కొనుగోలుచేసే సమయంలో గ్రామాలకు ఏఈఓలు రాకపోవడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలకు విత్తన వ్యాపారులు వచ్చి విత్తనాలు విక్రయిస్తుంటే నకిలీ విత్తనాలను గుర్తించడం కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మహ్మదాపూర్‌లో మూతపడిన రైతు వేదిక

చెరువు కుంట కబ్జాదారుడిపై చర్యలేవీ?

మిరుదొడ్డి(దుబ్బాక): చెరువు కుంటను కబ్జా చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని అక్బర్‌పేట–భూంపల్లి మండలం మోతె గ్రామస్తులు డిమాండ్ చేశారు. గ్రామంలోని వంజరి వారి చెరువు కుంటను కబ్జాచేసి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న భువనగిరికి చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం తహసీ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో రియల్ ఎస్టేట్ వ్యాపారి 40 ఎకరాల భూమిని కొనుగోలు చేశాడని తెలిపారు. ఆ భూమికి ఆనుకుని ఉన్న మూడెకరాల ప్రభుత్వ భూమిని సైతం స్వాధీనం చేసుకోవడమే కాకుండా చెరువు కుంటను కబ్జా చేశాడని ఆరోపించారు. అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కాలేరు శ్రీనివాస్, గ్రామస్తులు రంజిత్, రాజేశ్వర్, మల్లేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందిస్తున్న మోతె గ్రామస్తులు

ప్రభుత్వ పాఠశాలలను కొనసాగించాలి

- చదువుల్లో ధనిక, పేద అంతరాలు పోవాలి
- ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ప్రభుత్వ పాఠశాలలను కొనసాగించాలని, చదువుల్లో ధనిక, పేద అంతరాలు పోవాలని తెలంగాణ పౌరస్పందన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, ఉపాధ్యాయ మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. వేదిక రెండో విడత ప్రచార జాతా సిద్దిపేటలో మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుల్లో మార్పు రావాలన్నారు. ధనికుల పిల్లలైనా, పేదల పిల్లలైనా ఒకే పాఠశాల, ఒకే కళాశాల, ఒకే యూనివర్సిటీలో చదువుకోవాలనే లక్ష్యంతో తమ వేదిక పనిచేస్తుందని చెప్పారు. ఫీజులను బట్టి చదువులు లభిస్తాయనే విధంగా ప్రైవేటు విద్యా సంస్థల ప్రచారం చేస్తున్నాయన్నారు. లక్ష్మారెడ్డి, శశిధర్, షేక్‌వలి అహ్మద్, యాదగిరి, రవికుమార్, సంజీవ్, భరత్, మంగ, నాగమణి, ధనమూర్తి, నగేశ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న నర్సిరెడ్డి

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్ అన్నారు. తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన బడిబాట ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రజ్ఞాపూర్‌లో కళాజాత వాహనాన్ని మంగళవారం జెండాఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన అందుతుందన్నారు. సాంకేతికతతో కూడిన విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తున్నట్లు తెలిపారు. పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి టీపీటీఎఫ్ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు ప్రజల మనసు గెలిచిన నేత

మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు 53వ జన్మదిన వేడుకలు మంగళవారం నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలుచోట్ల నాయకులు కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. హరీశ్‌రావు ప్రజలందరి మనసులు గెలుచుకున్న నాయకుడని కొనియాడారు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. గజ్వేల్ ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పరిధిలోగల పల్లెపహాడ్ గ్రామంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ అనాథలైన చిన్నారులకు అండగా నిలిచారు. ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి చేతులమీదుగా రూ.53 వేలు ఆర్థికసాయం అందించారు.



సిద్దిపేటజోన్: ఎమ్మెల్యే హరీశ్‌రావు పుట్టినరోజు సందర్భంగా అన్నదానం చేస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సంపత్‌రెడ్డి తదితరులు



మర్కూక్‌లో విద్యార్థినులను సన్మానిస్తున్న ప్రతాప్‌రెడ్డి



బెజ్జంకిలో కేక్ కట్‌చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం



పరీక్షలు చేయించుకుంటున్న కార్మికులు

హుస్నాబాద్: స్వచ్ఛత వంద రోజుల కార్యాచరణలో భాగంగా స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం పారిశుద్ధ్య కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు ఎలాంటి సమస్యలున్నా వైద్యులకు చెప్పాలన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రమేశ్‌రెడ్డి, డాక్టర్ రవికాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ రవి కుమార్ పాల్గొన్నారు.

కాలువ పరిశీలన



కాలువను పరిశీలిస్తున్న అధికారులు

చిన్నకోడూరు(సిద్దిపేట): పెద్దకోడూరు నుంచి చిన్నకోడూరు మీదుగా ఇబ్రహీంనగర్ చెరువు వరకు వెళ్లే కాలువ చిన్నకోడూరు సమీపంలో పూడుకుపోవడంతో ఇరిగేషన్ అధికారులు మంగళవారం పరిశీలించారు. ఈ కాలువలో పూడికతీసి సాగునీరందేలా చూడాలని రైతులు ఇరిగేషన్ ఈఈ గోపాల కృష్ణకు వినతి పత్రం అందజేశారు. దీంతో ఆయన స్పందించి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాలువ సరిగా లేక సాగునీరందక పంట సాగు చేసుకోలేకపోతున్నామన్నారు. అధికారులు స్పందించి వెంటనే కాలువ పనులు చేపట్టాలని కోరారు.


బోరు మోటారు ప్రారంభం



మోటారును ప్రారంభిస్తున్న నాయకులు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని గండిపల్లి, పెద్దతండా గ్రామాల్లో హైమాస్ట్ లైట్, గ్రామస్తులకు తాగునీటి వసతి కోసం వేసిన బోరును మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ నిధులు కేటాయిస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్‌రెడ్డి, వేణుగోపాల్‌రావు, సంపత్, రవికుమార్, మోహన్ నాయక్, సంపత్, తిరుపతి నాయక్, లింగారెడ్డి, సాగర్ పాల్గొన్నారు.


కిసాన్ మేళాలో డెయిరీ స్టాల్స్



మాట్లాడుతున్న ఏడీ వెంకట్‌రెడ్డి

హుస్నాబాద్‌రూరల్: వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం నుంచి నిర్వహించే కిసాన్ మేళాలలో డెయిరీ స్టాల్స్ ఏర్పాటు చేయాలని ఏడీ వెంకట్‌రెడ్డి సూచించారు. పశు వైద్యులతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించి తగిన సూచనలిచ్చారు. పాల ఉత్పత్తిదారులకు వచ్చే లాభాలు, మేలు జాతి పశువుల గురించి రైతులకు అవగాహన కల్పించేలా స్టాల్స్ ఉండాలని చెప్పారు.

గ్రంథాలయం ప్రారంభం



ఉపేందర్‌ను సన్మానించిన లింగమూర్తి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి పిలుపునిచ్చారు. కేసీఆర్ నగర్ డబుల్‌బెడ్రూం కాలనీలో ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని టూటౌన్ సీఐ ఉపేందర్‌తో కలిసి మంగళవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రంథాలయంలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు.

వీఓఏపై ఫిర్యాదు

బెజ్జంకి(సిద్దిపేట): సంతకాన్ని ఫోర్జరీ చేసి రూ. 2లక్షలు కాజేసిన బేగంపేట వీఓఏపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు పబ్బతి సంధ్య మంగళవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఆమె మాట్లాడుతూ తాను ఆదర్శ గ్రూపులో వీఓ అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో తనకు తెలియకుండా లక్ష రూపాయల చొప్పున రెండు సార్లు బ్యాంకు నుంచి వీఓఏ విత్‌డ్రా చేసుకుందన్నారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.